క్లుప్తంగా

ఘనంగా శాంతీశ్వర బాబా జన్మదిన వేడుకలు



బాబాతో కలిసి పేదలకు వస్త్రదానం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

కంచిలి: మండలంలో శాసనాం గ్రామంలోని బాబా ఆశ్రమంలో శాంతీశ్వర బాబా జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. వేడుకలకు జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ హాజరై బాబాకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయనతో కలిసి పేదలకు వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి



నియామక పత్రాలు అందజేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: వలంటీర్లు బాధ్యతగా విధులు నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కారంగి మోహనరావు అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు నూతనంగా నియామకమైన వలంటీర్లకు స్థానిక ఎంపీపీ కార్యాలయంలో నియామక పత్రాలను గురువారం అందజేశారు. కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ మెంబర్ బెజ్జో, సర్పంచ్ కారంగి మోహనరావు, లోపింటి దీనబంధురెడ్డి, మాజీ జెడ్పీటీసీ దక్కత సూకయ్యరెడ్డి, బదకల మోహన్‌దాస్, రాంపత్ని చిట్టిబాబు, బాకి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

టెక్కలి: మండలంలోని సీతాపురం, తిర్లంగి గ్రామాల్లో ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజుకు రూ.257 వేతనం వేతనం వచ్చేవిధంగా పనులు నిర్వహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పనికి అనుకూలంగా ఉన్నటువంటి వనరులను ఉపాధిగా మలచుకోవాలన్నారు. ప్రతీ కుటుంబానికి ఉపాధి కల్పించాలని సూచించారు. ఆయనతో పాటు ఏపీడీ మురళీకృష్ణ, ఏపీవో బి.ప్రసాద్, ఎఫ్ఏ బి.చంద్రగిరి తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ లక్ష్యాలు నెరవేర్చాలి'

టెక్కలి: జల్ జీవన్ మిషన్ కార్యాక్రమంలో ప్రభుత్వ లక్ష్యాలు నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎంపీపీ సంపతిరావు రాఘవరావు గురువారం ఒక ప్రకటనలో సూచించారు. కాంట్రాక్టర్లు, అధికారులు ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పలు గ్రామాల్లో ప్రారంభించిన జల జీవన్ మిషన్ పనుల్లో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

టెక్కలి: ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులతో విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తే చర్యలు తప్పవని ఏపీ విద్యా మౌళిక వసతుల కల్పన విభాగం డైరెక్టర్ యు.విశ్వనాథం హెచ్చరించారు. టెక్కలి రవీంద్రభారతి పాఠశాలలో అధిక ఫీజులు, ఫెస్టివల్స్ పేరుతో డబ్బులు వసూలు చేయడంపై కొంతమంది తల్లిదండ్రులు విశ్వనాథం దృష్టికి తీసుకువెళ్లడంతో గురువారం పాఠశాలను తనిఖీ చేశారు. ప్రభుత్వం నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాలలో చోటు చేసుకున్న పరిస్థితులపై సంబంధిత సిబ్బందిని ప్రశ్నించారు. ఇక్కడి పరిస్థితిని విద్యా శాఖ మంత్రి, కమిషనర్ దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. ఇదే సమయంలో విద్యార్థి సంఘం నాయకుడు టి.సూర్యం అక్కడికి చేరుకుని విద్యార్థుల తల్లిదండ్రులకు మద్దతు పలికారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు



గాయపడిన పర్వతాలు

కోటబొమ్మాళి: మండలంలోని పెద్దబమ్మిడి వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా రంగాపురం గ్రామానికి చెందిన పర్వతాలు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పర్వతాలు పలాసలో కుటుంబంతో నివాసముంటూ ద్విచక్ర వాహనంపై గ్రామాల్లో తిరుగుతూ దుస్తులు అమ్ముతుంటాడు. గురువారం నరసన్నపేట వైపు వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో పర్వతాలు రెండు కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో నరసన్నపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ విశ్వేశ్వరరావు తెలిపారు.



నందిగాం: టీడీపీ నాయకుడికి పింఛన్ అందజేస్తున్న పేరాడ తిలక్ తదితరులు



పలాస: పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ రత్నాలు తదితరులు

పింఛన్ల పెంపు.. ఆనందం రెట్టింపు



కంచిలి: నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తదితరులు

● కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ



కోటబొమ్మాళి: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ లోకనాథం



పింఛన్లు అందజేస్తున్న ఉలాల భారతిదివ్య

కంచిలి: ప్రజలకు ఇచ్చిన మాటను తప్పని వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఎంపీడీవో చల్లా శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన మండలానికి నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ సొమ్మును రూ.3000 వరకు పెంచుకుంటూ వెళ్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, స్వచ్ఛ భారత్ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణరాళో, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: రాష్ట్రంలో అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు ఎంపీటీసీ ఆశి మంథాకిని అన్నారు. మండలంలోని లొద్దపుట్టి పంచాయతీ జగన్నాథపురంలో పింఛన్లను గురువారం పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ట్రేడ్ యూనియన్ కార్యదర్శి ఆశి పురుషోత్తమరెడ్డి పాల్గొన్నారు.

నందిగాం: వైఎస్సార్‌సీపీ హయాంలో అర్హులందరికీ నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో హెచ్‌వీ రమణమూర్తి ఆధ్యక్షతన మండలంలో నూతనంగా మంజూరైన పింఛన్లను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, వైస్ ఎంపీపీలు రేగల లక్ష్మీకాంతం, వసంత్‌కుమార్, నాయకులు జడ్యాడ జయరాం, అంబోడి విష్ణు, మడపాల సంజీవరావు, చిన్ని జోగారావు, సర్లాన బైరాగి, బొంగి మోహనరావు, హనుమంతురావు, బార్నన బాలకృష్ణ, పుష్యా సత్యం, బొమ్మాళి గున్నయ్య దానయ్య పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని మహసాహెబ్‌పేట పంచాయతీ కమలనాభపురంలో కొత్తగా మంజూరైన పింఛన్లను కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.హేమసుందరరాజు లబ్ధిదారులకు గురువారం పంపిణీ చేశారు.

మందస: అర్హులందరికీ వైఎస్సార్ పింఛన్ కానుక అందజేయడం జరుగుతోందని పీఏసీఎస్ చైర్మన్ అగ్గున్న సూర్యారావు అన్నారు. మండలంలోని పలు పంచాయతీల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమంలో బెల్లుపటియా, హన్నాళి, కొత్తపల్లి, సిద్ధిగాం, బిన్నళమదనాపురం సర్పంచ్‌లు ఎ.రమణమ్మ, అనసూయచౌదరి, సేనాపతి దివ్య, గున్న రమణ, మార్పు భవానీ, మండల కో–ఆప్షన్ సభ్యుడు యవ్వారి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు త్రినాథ్‌చౌదరి, సేనాపతి ఈశ్వరరావు, పైల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు నిష్పక్షపాతంగా అందజేస్తున్నామని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతి దివ్య అన్నారు. మున్సిపాలిటీ పరిధి 16వ వార్డులో పింఛన్లను పంపిణీ చేశారు.

పలాస: మండలంలోని గురుదాసుపురం సచివాలయంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ మచ్చ రత్నాలు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు మచ్చ ధనరాజు, గౌరకల షణ్ముఖరావు, ఎంపీటీసీ గౌరకల మనీషా, క్లస్టర్ ఇన్‌చార్జి జినగ సీతారాం, రంగోయి సర్పంచ్ సూర్యం, సాత్ర ప్రేమ్‌సుందర్, దేవరకొండ షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: పలాస మండలం అమలకుడియా పంచాయతీలో సర్పంచ్ కొర్ల శిరీష పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మురళీకృష్ణ చౌదిరి తదితరులు పాల్గొన్నారు.



మందస: బెల్లుపటియాలో పింఛన్లు అందజేస్తున్న దృశ్యం



కాశీబుగ్గ: అమలకుడియాలో పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



ఇచ్ఛాపురం: జగన్నాథపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ మంథాకిని

సమగ్ర సర్వేతో రైతులకు మేలు



ఇచ్ఛాపురం రూరల్: డ్రోన్ సర్వే ప్రారంభిస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూసర్వేతో రైతులకు మేలు జరుగుతుందని జగన్నాథపురం సర్పంచ్ నూక సత్తిరాజు అన్నారు. పంచాయతీలో జగనన్న శాశ్వత భూహక్కు సర్వే కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వాసు, మాజీ సర్పంచ్ ఎండ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: సమగ్ర భూసర్వేతో యజమానికి సర్వ హక్కులు లభిస్తాయని మండల సర్వేయర్ ఎం.తవిటినాయుడు అన్నారు. మండలంలోని లొద్దపుట్టి గ్రామంలో డ్రోన్‌తో రీసర్వేను వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆశి దాలయ్యరెడ్డి ప్రారంభించారు. సర్వే అనంతరం సరిహద్దులను గుర్తించి సర్వే రాళ్లను వేయడం జరుగుతుందన్నారు. ఇక నుంచి భూహక్కు పత్రాలే రైతులకు పాస్‌బుక్‌లుగా, 1–బీలుగా పరిగణించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డ్రోన్ జట్టు సభ్యులు శ్రీనివాసరావు, భానుప్రతాప్, సచివాలయం సర్వేయర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరికలు



పార్టీలో చేరినవారిని ఆహ్వానిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

మందస: మండల టీడీపీ అధికార ప్రతినిధి సార దూర్వాసులు వైఎస్సార్‌సీపీలో గురువారం చేరారు. పలాసలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు దుర్వాసులు, మరి కొంతమంది టీడీపీ నాయకులకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దూర్వాసులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి అప్పలరాజు ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితుడినై పార్టీ చేరానన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, మూలిపాడు సర్పంచ్ గుసిరి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

'ఎస్టీల్లో చేర్చవద్దు'



శామ్యూల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ నాయకులు

కాశీబుగ్గ: నకిలీ బెంతు ఒడియా, బోయి వాల్మీక కులాలను ఎస్టీల్లో చేర్చవద్దని విశ్రాంత ఐఏఎస్, ఏక సభ్య కమిషన్ సభ్యుడు ఆనంద్ కుమార్ శామ్యూల్‌కు ఆదివాసీ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఉద్దాన ప్రాంతాల్లో అధ్యయనం నిమిత్తం విచ్చేసిన ఆయన పలాస మండలం రామకృష్ణాపురం పవర్‌గ్రిడ్ గెస్ట్‌హౌస్‌లో సేదతీరారు. ఈ సందర్భంగా ఆయనను కలిసి జీవో నంబర్ 52ను రద్దు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆదివాసీ జేఏసీ అధ్యక్షుడు సవర రాంబాబు, ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు సవర జగన్నాయకులు, గిరిజన నాయకుడు సవర నందు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో తనిఖీలు

కోటబొమ్మాళి: స్థానిక కేజీబీవీలో కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి ఎస్.హరికృష్ణ గురువారం తనిఖీలు నిర్వహించారు. విద్యార్థినుల హాజరు, మెనూను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.వెంకటరత్నం, పీఈటీ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

దూడపై గుర్తు తెలియని జంతువు దాడి



దాడిలో తీవ్రంగా గాయపడిన దూడ

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దాన ప్రాంతంలో కొంత కాలంగా గుర్తు తెలియని అటవీ జంతువు (పెద్ద పిల్లిలాంటి జంతువు) సంచరించి మూగ జీవులపై దాడి చేస్తోంది. వజ్రపుకొత్తూరు మండలం శారదపురంలో గురువారం అదే తరహాలో పాడిరైతు బమ్మిడి చంద్రశేఖర్‌కు చెందిన దూడపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. విషయం తెలుసుకున్న పశువైద్యాధికారి మెట్ట పాపారావు సంఘటన స్థలానికి చేరుకుని దూడకు వైద్యం అందించారు. అలాగే అటవీశాఖాధికారులు సైతం గ్రామానికి చేరుకొని సంఘటన తీరును పరిశీలించారు. ఇటీవల మందస మండలంలో మూగ జీవులపై దాడి చేసిన గుర్తు తెలియని జంతువు ప్రస్తుతం ఈ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు అటవీ శాఖాధికారులు అనుమానిస్తున్నారు. పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దాడులను నియంత్రించేందుకు ఉద్దాన ప్రాంతంపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు వారు తెలిపారు.

అధికారులపై కేసు నమోదు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి మారుతీనగర్‌లో ప్రభుత్వ స్థలమని జేసీబీతో తొలగింపు పనులు చేపట్టిన అధికారులపై పోలీసు శాఖ చర్యలు చేపట్టింది. ఫిర్యాదుదారుడు బాసూరి హరీష్‌కుమార్ ఫిర్యాదు మేరకు మున్సిపల్ టీపీఎస్ శ్రీనివాసరావుతో పాటు మరో ఐదుగురు అధికారులపై ఎస్‌ఐ రమేష్ కేసు నమోదు చేశారు. కోర్టు నుంచి ఇంజెక్షన్ ఆర్డర్ తీసుకొచ్చామని ఆధారాలు చూపించినా అధికారులు కట్టడాలు తొలగించడంతో రూ.50 వేల వరకు నష్టం జరిగిందని ఫిర్యాదుదారుడు పేర్కొన్నారు.

నిబంధనలు పాటించాలి

కోటబొమ్మాళి: రైస్ మిల్లర్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని తర్లిపేటలో అమ్మ భగవాన్, పాకివలసలోని లక్ష్మీగణపతి రైస్ మిల్లులను గురువారం ఆయన తనిఖీ చేశారు. సకాలంలో బియ్యాన్ని సీఎంఆర్‌కు అందజేయాలని సూచించారు.

పలాసకు పీజీ సెంటర్ తీసుకొస్తాం



మంత్రి అప్పలరాజును సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

● మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: మారుమూల పలాస నియోజకవర్గానికి పీజీ సెంటర్‌ను తీసుకొస్తామని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాసలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని తెలియజేశారు. హైస్కూల్స్‌ను ఇంటర్ కళాశాలలుగా, ఇంటర్మీడియట్‌ఉన్నచోట డిగ్రీ కళాశాలలు ఏర్పాటు అవుతున్నాయన్నారు. కళాశాల భవన నిర్మాణాలకు ఇప్పటికే ఐదు ఎకరాల స్థలం గుర్తించామని, నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలియజేశారు. అన్ని వసతులు పూర్తిగా అందుబాటులోకి వస్తే పీజీ కళాశాలను తీసుకొస్తామన్నారు. ఇప్పటికే పలాస డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సులు తీసుకువచ్చామని అందులో బైపీసీలో అక్వాకల్చర్, ఆఫీస్ మేనేజ్‌మెంట్ కోర్సులతో పాటుగా మందస ఇంటర్ కళాశాలలో ఎంఎల్‌టీ కోర్సు, పూండి కళాశాలలో నర్సింగ్ కోర్సు ఏర్పాటు చేశామన్నారు. పలాస డిగ్రీ కళాశాలలో ఇండస్ట్రీయల్ కోర్సులతో పాటు ఆరు మాసాల ప్రత్యేక కోర్సులు ఏర్పాటు చేసి వివిధ ఉద్యోగాలకు చేరేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ టి.మధు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటమోహన్, నాయకులు తూముల శ్రీనివాసరావు, తమ్మినాన శాంతారాం, బల్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి



ఇచ్ఛాపురం రూరల్: మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాదరావు

టెక్కలి: మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని వెలుగు ఏసీ శ్రీరాములు అన్నారు. పీఎంఎఫ్ఎంఈ పథకం కింద సీడ్ క్యాపిటల్ రూపంలో రూ.40 వేల రుణం పొందిన స్వయం సహాయక సంఘాల లబ్ధిదారులకు స్థానిక వెలుగు కార్యాలయంలో శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆహార ఉత్పత్తులు తయారు చేసుకునేందుకు యంత్రాల కొనుగోలుకు రూ.10 లక్షల వరకు రుణం పొందేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఇంటి వద్దనే ఆహార ఉత్పత్తులను తయారు చేసుకునే మహిళలను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం 30 శాతం సబ్సిడీపై సుమారు రూ.10 లక్షల వరకు రుణాలు అందజేసేవిధంగా ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రతినిధి మోహన్‌కుమార్, ఎఫ్‌పీజీ ఏపీఎం రజని, ఏపీఎం నారాయణరావు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: డ్వాక్రా సంఘాల మహిళలు వ్యాపారులుగా రాణించాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఎస్.ప్రసాదరావు ఆకాంక్షించారు. మండలంలోని తేలుకుంచి గ్రామంలో 52 సంఘాల అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థిక క్రమశిక్షణ, ఆదాయ కార్యక్రమాల ఏర్పాటు, పుస్తక నిర్వహణ, రుణాలు పొందడం, సకాలంలో తిరిగి చెల్లించడం, ప్రభుత్వ పథకాలైన వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ పథకం, కల్యాణ మస్తు పథకాలపై అవగాహన కల్పించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న పిరియా సాయిరాజ్

● పిరియా సాయిరాజ్
● కర్తలిపాలేంలో గడప గడపకూ మన ప్రభుత్వం

సోంపేట: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. మండలంలోని కర్తలిపాలేం సచివాలయం పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి గత మూడున్నరేళ్లలో ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన వచ్చిందన్నారు. గ్రామాల్లోనే ప్రజా సమస్యలు పరిష్కారానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలు వేశారని తెలియజేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దాదాపు అమలు చేసిన సీఎంకు అండగా నిలవాలని కోరారు. అనంతరం స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీడాప్ చైర్మన్ శాడి శ్యాంప్రసాద్ రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర్‌రెడ్డి, సోంపేట, కంచిలి ఎంపీపీలు నిమ్మాన దాస్, పైల దేవదాస్ రెడ్డి, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ మద్దు రాజారావు, బూత్ కమిటీ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ, సర్పంచ్ పొందూరు గున్నయ్య, పార్టీ నాయకులు వినోద్‌కుమార్ పండా, ఎస్.కిరణ్, బి.ఢిల్లీరావు, పండా, కె.శ్రీనువాసరావు, ఎస్.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..


హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందజేత



లక్ష్మికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శాంతారావు

నందిగాం: మండలంలోని కొత్తగ్రహారం సచివాలయం పరిధి జడ్యాడకు చెందిన తమ్మినాన లక్ష్మికి ఒంటరి మహిళా పింఛన్ వస్తోంది. ఆమె హైదరాబాద్‌లో పనులు చేసుకుంటూ నివసిస్తోంది. అయితే ఇటీవల అక్కడ రోడ్డు ప్రమాదానికి గురవ్వడంతో పింఛన్ తీసుకోవడానికి ఇంటికి రాలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో వలంటీర్ తమ్మినాన శాంతారావు హైదరాబాద్ తన స్వంత ఖర్చులతో వెళ్లి లక్ష్మికి పింఛన్ అందజేశారు. అతడిని పలువురు అభినందించారు.

విశాఖపట్నం వెళ్లి...



పురుషోత్తంకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నీలకంఠం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి 14వ వార్డుకి చెందిన దుర్గాసి వెంకట పురుషోత్తం విశాఖపట్నంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో డయాలసిస్ చికిత్స పొందుతున్నాడు. దీంతో వార్డు వలంటీర్ నీలాపు నీలకంఠం విశాఖపట్నం వెళ్లి అతడిని పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, వార్డు కౌన్సిలర్ నీలాపు లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్‌లు అభినందించారు.

తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు

కాశీబుగ్గ: వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 19వ వార్డు కౌన్సిలర్ శిష్టు బృందావతి అన్నారు. మండలంలోని సూదికొండలో తాగునీటి ట్యాంకర్, పవర్ బోర్ ఏర్పాటుకు గురువారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి శిష్టు గోపి, నాయకులు బోడ్డూరు ఈశ్వరరావు, బగాది సింహాచలం, తాళ్లభద్ర శైలజ, బొమ్మాళి సారధి, వినోద్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

నందిగాం: మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన నందిగాం శివకుమార్ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా చెక్కును రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తిలు గురువారం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు జడ్యాడ జయరాం, అంబోడి విష్ణు పాల్గొన్నారు. అలాగే పిడుగు పడి మృతి చెందిన కొల్లి వనజనాభం భార్యకు వైఎస్సార్ బీమా కింద మంజూరైన రూ.5 లక్షల చెక్కును సర్పంచ్ పోలాకి మోహనరావు అందజేశారు.

ఆర్థిక సాయం అందజేత

కవిటి: మండలంలోని ఎర్రగోవిందపుట్టుగ గ్రామానికి చెందిన ఎర్ర మీన ఒంగోలు కిమ్స్‌లో ప్రథమ సంవత్సరం నర్సింగ్ విద్యను అభ్యసిస్తుంది. ఆమెకు శ్రీచింతామణి ట్రస్ట్ (హైదరాబాద్) సభ్యులు రూ.20 వేల ఆర్థిక సాయం గురువారం అందజేసినట్లు సర్పంచ్ పూడి లక్ష్మణరావు తెలిపారు.

సమయపాలన పాటించాలి

నందిగాం: ఉపాధి వేతనదారులు సమయపాలన పాటించి పూర్తి వేతనం పొందాలని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు సూచించారు. మండలంలోని పెద్దలవునిపల్లి, దేవుపురం గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న చెరువు, పంట కాలువను పరిశీలించారు. ఆయనతో పాటు టెక్కలి క్లస్టర్ ఏపీడీ మురళీకృష్ణ, ఎంపీడీవో హెచ్‌వీ రమణమూర్తి, ఏపీవో నాగరాజు, ఈసీ ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

కాలిన గాయాలతో వృద్ధుడు మృతి

కంచిలి: మండలంలోని శాసనాం గ్రామానికి చెందిన వృద్ధుడు మల్లపిరెడ్డి హరి(60) కాలిన గాయాలతో సోంపేట సీహెచ్‌సీలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. బుధవారం రాత్రి శాంతీశ్వర బాబా ఆశ్రమంలోని గోశాలలో జరిగిన ప్రమాదంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని భార్య రత్నం ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్‌ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.